సాక్షి చిత్తూరు

శుక్రవారం । 17 । ఫిబ్రవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,100

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000

రిటైల్ వెండి గ్రాము రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	33	17
తిరుపతి	34	18
తిరుమల	30	13
గూడూరు	33	19
నగరి	33	18



స్వర్ణ రథంపై కల్యాణ వెంకన్న

శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారు, ఉభయదేవేరులతో కలసి స్వర్ణరథంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. – చంద్రగిరి

న్యూస్‌రీల్

భూ ఆక్రమణలు నిరూపిస్తే.. ఆ భూమి లోకేష్‌కు ఉచితం

– డిప్యూటీ సీఎం నారాయణస్వామి



ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

గంగాధరనెల్లూరు: నారా లోకేష్‌కు దమ్ము ధైర్యం ఉంటే తాను 200 ఎకరాల భూమిని ఆక్రమించుకున్నానని నిరూపిస్తే ఆ 200 ఎకరాలు ఉచితంగా ఇస్తానని డిప్యూటీ సీఎం నారాయణస్వామి సవాల్ విసిరారు. లక్ష్మిరెడ్డిపల్లిలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. నారా లోకేష్ నోటికి వచ్చింది మాట్లాడితే.. దాన్ని అచ్చు వేసేముందు 'పచ్చ' పత్రిక నిజానిజాలు తెలుసుకోవాలని సూచించారు. లోకేష్ చెప్పినట్టు తాను 200 ఎకరాలు ఆక్రమించుకున్నట్టు నిరూపిస్తే ఆ 200 ఎకరాలు లోకేష్ ఉచితంగా ఇస్తానన్నారు. తాను ఏనాడూ అవినీతికి పాల్పడలేదని స్పష్టంచేశారు. అవినీతికి పాల్పడినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానన్నారు. తనకు ఏడు ఎకరాల లోపు భూమి మాత్రమే ఉందన్నారు. లోకేష్ పాదయాత్రకు స్థానికంగా ప్రజలు ఎవరూ రాకపోవడంతో తమిళనాడు, కర్ణాటక నుంచి ప్రజల్ని తెచ్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు లోకేష్‌కు దిశతులంటే గిట్టదన్నారు.

94 మందికి విముక్తి



మాట్లాడుతున్న జడ్జి కరుణకుమార్

చిత్తూరు అర్బన్: జిల్లావ్యాప్తంగా 94 మందికి వెట్టిచాకిరీ నుంచి విముక్తి కల్పించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. గురువారం చిత్తూరులోని న్యాయసేవాసదన్ భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన వెట్టిచాకిరీ విమోచన వారోత్సవాల్లో పోలీసు, రెవెన్యూ యంత్రాంగంతో కలిసి 94 మందిని నిర్బంధ వెట్టి చాకిరీ నుంచి విముక్తి కల్పించి.. స్వేచ్ఛా జీవనంలోకి తీసుకొచ్చామన్నారు. ఎవరూ కూడా చేసే వృత్తిలో పని గంటలు మించి నిర్బంధంగా పనులు చేయడానికి వీల్లేదన్నారు. వెట్టి చాకిరీ విముక్తికి అందరూ సహకరించాలని ఆయన కోరారు.

నేడు పర్యావరణ విద్య పరీక్ష

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు శుక్రవారం పర్యావరణ విద్య పరీక్షను నిర్వహించనున్నట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్ఐఓ) రమేష్ తెలిపారు. ఈ పరీక్షను ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల్లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ పరీక్షకు 316 జూనియర్ కళాశాలల్లోని ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు 48,549 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ప్రథమ సంవత్సర విద్యార్థులందరూ తప్పనిసరిగా ఈ పరీక్షకు హాజరవ్వాలని ఆర్ఐఓ కోరారు.

యమగళం!

స్పందన లేని నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు తంటాలు పడుతున్నారు. డబ్బులిచ్చి ఇతర రాష్ట్రాల నుంచి జనాన్ని తీసుకొచ్చి దింపుతున్నారు. ఇదిచాలదన్నట్టు తమ నాయకుడి వద్ద మెప్పుపొందేందుకు కొత్త కుట్రలకు తెరలేపుతున్నారు. కార్యకర్తలను మభ్యపెట్టి పొలాలను సైతం దున్నించేస్తున్నారు. తద్వారా ప్రజల వద్ద సానుభూతితోపాటు తమ అధినేత వద్ద మంచి మార్కులు కొట్టేయాలని తీవ్రంగా ప్రత్నిస్తున్నారు. యువగళం పేరుతో చేపట్టిన పాదయాత్రలో అనర్థాలు చోటు చేసుకుంటున్నా.. విధుల్లో ఉన్న అధికారులు, నేతల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా లెక్కచేయకుండా ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు భక్తుల ప్రాణాలతోనూ చెలగాటమాడేందుకు కుయుక్తులు పన్నుతున్నారు. శివరాత్రి రోజే శ్రీకాళహస్తి పట్టణంలో రోడ్‌షో, సభలకు అనుమతివ్వాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీనిపై స్థానికులతోపాటు శివభక్తులు రగిలిపోతున్నారు. మొదలే ఇరుకు వీధులు.. ఆపై శివభక్తులు.. తొక్కిసలాటలు..తోపులాటల్లో ఎవరి ప్రాణాలు తీస్తారోనని ఆందోళన చెందుతున్నారు.



రోటావేటర్‌తో దున్నేసిన వేరుశనగ పంట(ఇన్‌సెట్) రైతు మురళీకృష్ణారెడ్డి

- ప్రజలకు వణుకుపుట్టిస్తున్న లోకేష్ యువగళం పాదయాత్ర
- పాదయాత్రను హైలెట్ చేసుకునేందుకు నేతల తంటాలు
- బయటపడుతున్న నాయకులు, కార్యకర్తల కుట్ర కోణాలు
- తన పంట తానే ధ్వంసం చేసి వైఎస్సార్‌సీపీపై నెట్టే ప్రయత్నాలు
- ఇప్పుడు శివరాత్రికి వచ్చే భక్తుల ప్రాణాలతో చెలగాటమాడేలా నాటకాలు
- శివరాత్రి రోజే రోడ్‌షో, సభలకు అనుమతివ్వాలంటూ అధికారులపై ఒత్తిళ్లు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న శివభక్తులు

సాక్షి, తిరుపతి: టీడీపీ కార్యకర్త నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర జిల్లాలో అంతంతమాత్రంగా సాగుతోంది. స్పందన నామమాత్రంగా ఉండడంతో ఒకింత ఆ పార్టీ నేతలను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకానొక దశలో పట్టుమని పది మంది కూడా రాకపోవడంతో నవ్వులపాలవుతోంది. దీంతో ఆ పార్టీ అగ్రనాయకులు చంద్రబాబుతోపాటు, లోకేష్ ఒకింత అసహనం వ్యక్తం చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలోనే పాదయాత్రను ఎలాగైనా సక్సెస్ చేయాలని ఆ పార్టీ యంత్రాంగం అడ్డదారులు తొక్కుతోంది. దాన్ని తమకు అనుకూల మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోంది.

శివా.. ఈ కుట్రలు కనవా?

దక్షిణ కైలాసంగా వెలుగొందుతున్న శ్రీకాళహస్తిలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 13 నుంచి 26 వరకు నిర్వహిస్తున్నారు. ఈనెల 18 (శనివారం) మహాశివరాత్రి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదే రోజు సుమారు నాలుగు లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉండడంతో అందుకు తగ్గ ఏర్పాట్లు చేపడుతున్నారు. బస్సులు, లారీలతోపాటు, ఇతర భారీ వాహనాలు పట్టణంలోకి రానీకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనికితోడు ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో పట్టణంలో ఎలాంటి రాజకీయ యాత్రలు, రోడ్‌షోలకు అనుమతి ఉండదు. అయినా టీడీపీ నేతలు శివరాత్రి రోజే నారా లోకేష్ పాదయాత్ర పట్టణంలో సాగే విధంగా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. భక్తులు వెళ్లే మార్గమైన పొన్నాలమ్మ ఆలయం వద్ద బహిరంగ సభకు అనుమతివ్వాలంటూ అధికారులపై ఒత్తిళ్లు చేస్తున్నారు. ఈ మేరకు మాజీ మంత్రి తొట్టంబేడు పోలీసులతో వాగ్వాదానికి దిగారు.



ధ్వంసమైన పంటలో టీడీపీ నాయకుల డ్రామా

ఆది నుంచీ అనర్థాలే

లోకేష్ పాదయాత్ర ప్రారంభం నుంచి అనర్థాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. తొలిరోజు తారకరత్న గుండెపోటుకు గురవ్వగా.. తర్వాత ఓ కానిస్టేబుల్ ఊపిరాడక మృతిచెందాడు. మరో కార్యకర్త త్రిశూలంపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. తదనంతరం వందల మంది కార్యకర్తలు స్వల్పగాయాల పాలవుతున్నారు. ఇలాంటి సందర్భంలో శివరాత్రి నాడే శ్రీకాళహస్తిలో రోడ్ షో నిర్వహించాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి గురువారం రాత్రి తొట్టబేడు పోలీస్‌స్టేషన్ ఎదుట నానాయాగి చేశారు. మొదలే అంతంతమాత్రంగా ఉన్న ఇరుకు వీధుల్లో రోడ్ షోలు, సభలు పెడితే భక్తుల పరిస్థితి ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇది రోగుల ప్రాణాలతో చెలగాటమాడడమేనని ఆందోళన చెందుతున్నారు.

అనుమతిస్తే ఇబ్బందులెన్నో

లోకేష్ పాదయాత్రకు అనుమతిస్తే సవాలక్ష సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. మొదలే పట్టణంలోని వీధులు అంతంతమాత్రం. ఎప్పుడో పురాతన కాలంలోని నాలుగు మాడ వీధుల్లో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులే. దీనికితోడు మహాశివరాత్రి ఉత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో వాహన సేవలు తిరగాల్సి ఉంటుంది. అదే సమయంలో పట్టణంలోకి కనీసం బస్సులను కూడా అనుమతించరు. ఆపసోపాలు పడి భక్తులు, ప్రయాణికులు, స్థానికులు రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో లోకేష్ పాదయాత్రకు అనుమతిస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భక్తుల ప్రాణాలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని ఆవేదన చెందుతున్నారు.

పంటను దున్నేసి.. అసలు దొంగను పట్టేసి..

తొట్టంబేడు మండలం, చిట్టత్తూరు గ్రామానికి చెందిన మురళీకృష్ణారెడ్డి టీడీపీకి నమ్మినబంటు. ఇటీవల ఆయన తన ఆరు ఎకరాల పొలంలో వేరుశనగ పంట సాగుచేశాడు. ప్రస్తుతం ఆ పంట పూత, పిందె దశకు చేరింది. ఈ పంట మొత్తం దున్నేసి, దాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టాలని స్థానిక టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు, కొందరు నేతలు పథకం రచించారు. తద్వారా పాదయాత్రలో లోకేష్ ధ్వంసమైన పంటను పరిశీలించి అధికారపార్టీ నేతలతోపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిట్టించాలని ప్రణాళిక రచించారు. ఇలా చేస్తే మండలంలో 'నువ్వే లీడర్వు' అంటూ సదరు రైతును నమ్మించారు. అనుకున్నదే తడవుగా గత గురువారం రాత్రి సదరు రైతు మురళీకృష్ణారెడ్డి ఇంటి నుంచి బయటకు వెళ్లినట్లు స్థానికులను నమ్మించాడు. అదే రోజు రాత్రి రోటావేటర్‌తో తన వేరుశనగ పంటను ధ్వంసం చేశాడు. తర్వాత శుక్రవారం ఉదయం తన పంటను వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆనందరెడ్డి నాశనం చేశారంటూ గగ్గోలుపెట్టారు. ఇదే అదనుగా టీడీపీ నేతలంతా గ్రామంలో పర్యటించి హడావుడి చేశారు. వైఎస్సార్‌సీపీపై లేనిపోని విమర్శలు చేశారు. ఆపై పోలీసులకు ఫిర్యాదు చేసి విచారణ చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో పోలీసులు కాల్ డేటా ఆధారంగా పలువురిని ప్రశ్నించారు. అనంతరం సీసీ ఫుటేజీలు పరిశీలించి అసలు దొంగ మురళీకృష్ణారెడ్డేనని తేల్చారు. విచారణలో అతను చేసిన తప్పును ఒప్పుకుని పోలీసుల ఎదుట లొంగిపోయాడు. నిజం బయటపడడంతో టీడీపీ శ్రేణులు, ఎల్లో మీడియా తమకు అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారం మొదలు పెట్టారు.

సంక్షేమం, అభివృద్ధే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

- సీఎం జగన్‌లా హామీలు చేసిన నాయకున్ని చూడలేదు
- ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించండి
- రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించాలి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పక్కన ఎంపీలు రెడ్డెప్ప, రంగయ్య



పులిచెర్లలో గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పుంగనూరు: సంక్షేమం, అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీలో గృహసారథులు, కన్వీనర్ల సమావేశాన్ని ఎంపీలు రెడ్డెప్ప, తలారీ రంగయ్యతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ గృహసారథులకు పార్టీ విధివిధానాలను ప్రతి ఇంటికీ తెలియజేసే బాధ్యతను అప్పగించడం జరిగిందన్నారు. అలాగే ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు చేసిన మోసాలు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీని పటిష్టం చేసేందుకు కృషి చేసే గృహసారథులకు పార్టీ పరంగా తగిన గుర్తింపు ఇస్తామన్నారు. గృహసారథులు ఈనెల 18 నుంచి 26 వరకు ఈ కార్యక్రమాన్ని ప్రతి ఇంటికీ వెళ్లి నిర్వహించాలన్నారు. రాష్ట్రంలో పుంగనూరు నియోజకవర్గం ఆదర్శంగా ఉండేలా పని చేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ పంపిన కిట్లను మంత్రి పెద్దిరెడ్డి పంపిణీ చేశారు. సమావేశంలో టీటీడీ బోర్డు మెంబరు పోకల అశోక్‌కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, రాష్ట్రజానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కన్వీనర్ వరదారెడ్డి పాల్గొన్నారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): 'నా రాజకీయ జీవితంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తరహాలో హామీలు అమలు చేసిన నాయకులను నేను ఎన్నడూ చూడలేదని' మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. పులిచెర్లలో గురువారం గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లకు మండల సచివాలయ కన్వీనరు ముర్వత్ బాషా అధ్యక్షతన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ మన సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి గురించి ప్రతి కుటుంబం వద్దకు వెళ్లి వివరించాలని సూచించారు. భవిష్యత్‌లో మరింత లబ్ధి చేకూరాలన్నా, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా తిరిగి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావాలన్నారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో ఎర్రంవాండ్లపల్లె టీడీపీకి చెందిన ఆరు కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, జింకా చలపతి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి, జెడ్పీటీసీ మురళీధర్, జిల్లా ప్రింటింగ్ ప్రెస్ చైర్మన్ మురళీ మోహన్‌రెడ్డి, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, రాజారెడ్డి, ఎస్ఎస్ రెడ్డి ప్రకాష్, వైస్ ఎంపీపీ ఈశ్వరి, సర్పంచ్ రాణెమ్మ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాన్ని పెంపొందించాలి



సూచనలిస్తున్న డీఈఓ శేఖర్

పుత్తూరు రూరల్: విద్యార్థుల్లో సబ్జెక్టుల వారీగా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తిరుపతి జిల్లా డీఈఓ డాక్టర్ వి.శేఖర్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఎస్ఎస్‌సీ ఓరియంటేషన్ ట్రైనింగ్ క్లాసులను పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతికి చెందిన సీ, డీ గ్రేడ్ విద్యార్థుల సామర్థ్యం పెంపునకు సబ్జెక్టుల వారీగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక డీవైఈఓ పి.రఘురామయ్య, హెచ్‌ఎంలు ఆనందబాబు, గీతాకుమారి, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

ఆలయానికి నంది వాహనం వితరణ



నందివాహనం బహూకరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

- భక్తుల కోసం రూ.1.80 లక్షల విలువ చేసే వాహనం అందజేత
- క్యాన్సర్ బాధితునికి రూ.50 వేలు ఆర్థికసాయం
- దాతృత్వం చాటుకుంటున్న మంత్రి రోజా



బాధితునికి ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి రోజా

నగరి : పట్టణ పరిధిలోని కరకంఠేశ్వర స్వామి ఆలయానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా నందివాహనాన్ని వితరణగా అందించారు. గురువారం ఆలయానికి విచ్చేసిన ఆమె రూ.1.80 లక్షల విలువ గల నందివాహనాన్ని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా నందివాహనానికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి ధూప,దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో మంత్రి నందివాహనానికి పూజలు చేశారు. అర్చకులు ఆమెను పుష్పాలతో ఆశీర్వదించారు. ఆలయంలో జరిగే నందిసేవలో భక్తులు పాల్గొనే భాగ్యం కలుగుతుందని ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తెలిపారు. ఆలయ కమిటీ తరఫున మంత్రి రోజాను దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రారెడ్డి, ఎంపీపీ భార్గవి, వైస్ ఎంపీపీ ఢిల్లీ, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, కౌన్సిలర్లు దయానిధి, బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, ఇంద్రయ్య, అమర్, నాయకు లు బాబురెడ్డి, తేన్‌మొళి, శశికళ, వెంకటేశ్, శ్రీనివాసులు, ప్రకాష్, సలీం, శీన తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితునికి రూ.50 వేలు ఆర్థిక సాయం

నగరి : పార్టీ అభివృద్ధికి కృషి చేసిన ప్రతి కార్యకర్త, నాయకుడికి ఎటువంటి ఆపద వచ్చినా వెన్నంటే ఉంటానని మంత్రి ఆర్‌కే రోజా హామీ ఇచ్చారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వడమాలపేట మండల దాసరి వీధికి చెందిన తులసికి గురువారం ఆమె రూ.50 వేలు ఆర్థికసాయం అందించి దాతృత్వం చాటుకున్నారు. తులసి అనారోగ్యం విషయాన్ని అతని సోదరుడు వడమాలపేట మండల సోషల్ మీడియా కన్వీనర్ జగదీష్, మంత్రి సోదరుడు రాంప్రసాద్ రెడ్డికి, మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె బాధితునికి నగరిలోని తన కార్యాలయంలో రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఆర్థికసాయం అందజేశారు. టాటా క్యాన్సర్ హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మొదలైన నామినేషన్ల పర్వం

- గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ నోటిఫికేషన్ జారీ
- ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కూడా..
- తొలిరోజు టీచర్ ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్‌కు ఒక్కో నామినేషన్ దాఖలు

చిత్తూరు కలెక్టరేట్: ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల (తూర్పు రాయలసీమ) ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు చిత్తూరు కలెక్టరేట్‌లో గురువారం గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్‌ను రిటర్నింగ్ అధికారి జేసీ వెంకటేశ్వర్ విడుదల చేశారు. విడుదల చేసిన ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను కలెక్టరేట్‌లోని నోటీస్ బోర్డులో అతికించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ నామినేషన్ పత్రాలు అభ్యర్థిచేత గానీ అతను/ఆమె ప్రతిపాదకుని చేతనైనా ఈనెల 23వ తేదీలోపు (ప్రభుత్వ సెలవు రోజు కాకుండా) దాఖలు చేయవచ్చన్నారు. అభ్యర్థులు చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి (కలెక్టర్) చాంబర్ వద్ద లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి (డీఆర్వో) వద్ద నామినేషన్ పత్రాలు అందజేయవచ్చని తెలిపారు. పోటీచేసే అభ్యర్థులు కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు పొందవచ్చన్నారు. ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటలకు నామినేషన్ పత్రాలను పరిశీలిస్తామని చెప్పారు. నామినేషన్ పత్రాల ఉపసంహరణ నోటీసును అభ్యర్థి, ప్రతిపాదకుడు రాతపూర్వకంగా ఈనెల 27న మధ్యాహ్నం 3 గంటల్లోపు అందజేయవచ్చన్నారు. అదేరోజు ఉపసంహరణకు అవకాశం ఉంటుందని తెలిపారు. మార్చి 13న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్టు వెల్లడించారు.

తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు

తొలిరోజు ఎమ్మెల్సీ నామినేషన్‌ల సందడి మొదలైంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కలెక్టరేట్ వద్ద పకడ్బందీ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఐదుగురిని మాత్రమే లోనికి అనుమతించారు. టూటౌన్ పోలీస్ స్టేషన్ సీఐ మద్దయ్య ఆచారి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించారు. తొలి రోజు రెండు నామినేషన్‌లు దాఖలుకాగా.. అందులో టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి చిత్తూరు నగరానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు స్వతంత్ర్య అభ్యర్థిగా శ్రీరామమూర్తి నామినేషన్ వేశారు. టీడీపీ బలపరిచిన నెల్లూరు జిల్లా కందుకూరుకు చెందిన గ్రాడ్యుయేట్ అభ్యర్థి శ్రీకాంత్‌చౌదరి నామినేషన్ పత్రాలు ఆర్వోకు అందజేశారు. ఆయనతో పాటు సిట్టింగ్ టీడీపీ ఎమ్మెల్సీ రాజసింహులు తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి తొలిరోజు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదని ఎన్నికల ర్వో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ వెల్లడించారు.



గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్



ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న ఆర్వో, జేసీ

బీసీ నేతలతో సిపాయి సమావేశం

- తదుపరి కార్యాచరణపై చర్చ



బీసీ నేతలతో సమావేశమైన సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి: టీడీపీ సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేసిన డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం బీసీ నేతలతో వరుసగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా వన్నెకుల క్షత్రియ సామాజికవర్గం వారితో భేటీ అవుతున్నారు. తిరుపతి నగరంలోని తన కార్యాలయంలో గురువారం రేణిగుంట మండలానికి చెందిన కొందరు బీసీ నాయకులతో సమావేశమయ్యారు. టీడీపీ బీసీలకు చేసిన మోసాల గురించి ఆ సామాజికవర్గం వారంతా ఆగ్రహం వ్యక్తంచేశారు. బీసీలను గౌరవించి, ప్రాధాన్యత ఉన్న పార్టీలో చేరాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

క్లుప్తంగా

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్కిల్ హబ్ సెంటర్‌లో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలపై శిక్షణా తరగతులను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎం.గుణశేఖర్‌రెడ్డి గురువారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా అకౌంట్ ఎగ్జిక్యూటివ్‌కు బీకాం, ఎంబీఏ, ఎంకాం విద్యార్హత కలిగిన వారు, కలంకారీ ఆర్టీసియన్‌కు 5వ తరగతి విద్యార్హత కలిగి, 18–35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 19లోపు తమ పేర్లను కళాశాలలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. శిక్షణ పొందిన వారికి స్కిల్ ఇండియా సర్టిఫికేషన్‌తో పాటు ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామన్నారు.

నేటి నుంచి మాజీ మేయర్ హత్యకేసు విచారణ

- చిత్తూరు మహిళా కోర్టులో శుక్రవారం నుంచి జూలై 7 వరకు షెడ్యూల్
- ఆపై తుది తీర్పు వెల్లడించనున్న కోర్టు
- 22 మంది నిందితులు, 130 మంది సాక్షులు
- భారీ భద్రత ఏర్పాటు చేసిన పోలీసులు



చిత్తూరులోని న్యాయస్థానాల సముదాయం


హత్యకు గురైన అనురాధ, మోహన్ (ఫైల్)

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలోనే సంచలనం సృష్టించిన చిత్తూరు మాజీ మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ జంట హత్యల కేసు విచారణ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. చిత్తూరులోని ప్రత్యేక మహిళా న్యాయస్థానంలో జూలై వరకు సాక్ష్యుల నిరవధిక విచారణ జరగనుంది. న్యాయమూర్తి ఎన్.శాంతి కేసు విచారించనున్నారు. ఈ జంట హత్యల కేసు విచారణకు ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శైలజ వ్యవహరించనున్నారు.

గతం ఇదీ..

2015 నవంబరు 17న అప్పటి మేయర్ అనురాధ, ఆమె భర్త మోహన్ చిత్తూరు నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉండగా ముసుగులు (బుర్కా) ధరించి వచ్చిన ఓ వ్యక్తితో పాటు మరికొందరు తుపాకులు, కత్తులతో చాంబర్‌లోకి చొరబడ్డారు. మేయర్ అనురాధను తుపాకీతో కాల్చి చంపగా, ఆమె భర్త మోహన్‌ను కార్యాలయంలో వేటాడి కత్తులతో నరికి హతమార్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా పోలీసుశాఖ వైఫల్యానికి అద్దం పట్టే ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

నిందితులు వీళ్లే..

అనురాధ, మోహన్ జంట హత్యల కేసులో తొలుత 23 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్ అనే వ్యక్తికి ఈ కేసులో సంబంధం లేదని న్యాయస్థానం గతంలో తీర్పు ఇవ్వడంతో 22 మంది నిందితులు మిగిలారు. చింటూతో పాటు వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్, మురుగ, యోగ, పరంధామ, హరిదాస్, మొగిలి, శశిధర్, ఎంఎస్.యోగానంద్, ఆర్‌వీటీ బాబు, లోకేష్, రఘుపతి, నాగరాజు, వెంకటానందకుమార్, కమలాకర్, రజనీకాంత్, నాగేంద్ర తదితరుల పేర్లతో పోలీసులు కోర్టులో నేరాభియోగపత్రం (చార్జ్‌షీట్) దాఖలు చేశారు. 22 మంది నిందితుల్లో చింటూతో పాటు నలుగురు నిందితులు అండర్ ట్రయల్ ఖైదీలుగా జైల్లోనే ఉన్నారు. మిగిలినవాళ్లు బెయిల్‌పై ఉన్నారు. ఈ కేసులో మొత్తం 130 మంది సాక్ష్యులుగా ఉన్నారు. షెడ్యూల్ ప్రకారం విచారణ పూర్తి చేసి న్యాయస్థానం తుది తీర్పును వెలువరించనుంది.

కోర్టు వద్ద భారీ భద్రత..

కేసు విచారణ ఈనెల జూలై 7వ తేదీ వరకు చిత్తూరులోని పాత కోర్టు సముదాయం వద్ద ఉన్న పోక్సో కోర్టులో విచారణ జరగనుంది. కేసు ట్రయల్ పూర్తయ్యేంత వరకు కోర్టు వద్ద భారీ భద్రతను ఏర్పాటు చేయాలని ఎస్పీ రిశాంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో కోర్టు వద్ద బందోబస్తు ఉంచగా, సాక్షులకు పూర్తిస్థాయి రక్షణ ఇవ్వనున్నట్లు ఎస్పీ స్పష్టం చేశారు.

కుతూహలమ్మకు కన్నీటి నివాళి





కుతూహలమ్మ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డప్ప, టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్, నివాళులర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

తిరుపతి మంగళం/గంగాధరనెల్లూరు : మాజీ మంత్రి, మాజీ డిప్యూటీ స్పీకర్ కుతుహలమ్మ పార్థివదేహాన్ని సందర్శించి రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, టీటీడీ పాలకమండలి సభ్యుడు పోకల అశోక్‌కుమార్ నివాళులర్పించారు. కుతూహలమ్మ మృతి చెందిన విషయాన్ని మంత్రి పెద్దిరెడ్డి తెలుసుకుని గురువారం తిరుపతిలోని ఆమె ఇంటికి చేరుకుని నివాళులర్పించారు. నిత్యం ప్రజాసేవే పరమావధిగా పని చేసిన కుతూహలమ్మ మృతి ఎంతో బాధాకరమన్నారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను మంత్రి పెద్దిరెడ్డి పరామర్శించి, కుటుంబానికి తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. లక్ష్మిరెడ్డిపల్లిలో ప్రభుత్వ లాంఛనాలతో కుతూహలమ్మ పార్థివదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మాజీ ఎమ్మెల్యేలు గాంధీ, లలితకుమారి, చిత్తూరు జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, తదితరులు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను నారాయణస్వామి ఓదార్చారు.

రావణబ్రహ్మపై నీలకంఠుడు



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)/శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరస్వామి రావణ వాహనం అధిరోహించి పురవీధుల్లో విహరించారు. ఆయన పక్కనే జ్ఞానప్రసూనాంబ అమ్మవారు మయూర వాహనంపై సాగారు. స్వామి అమ్మవార్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కాగా ఉదయం హంసవాహనంపై వాయులింగేశ్వరుడు, యాళి వాహనంపై జ్ఞానప్రసూనాంబ ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం హంస, శుకవాహనసేవ, రాత్రి శేష, యాళివాహన సేవలు జరగనున్నాయి.

ఐదు వేల మందితో శివదీక్ష


భక్తులతో కలిసి శివమాల ధరించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గురువారం ఐదువేల మందితో కలసి శివమాల ధరించి దీక్ష చేపట్టారు. శివరాత్రి ఉత్సవాలు ముగిసేవరకు ఈ దీక్ష కొనసాగిస్తారు. నాలుగేళ్ల క్రితం ఎమ్మెల్యే ఒక్కరే ఈ మాల ధరించారు. ఎమ్మెల్యేని ఆదర్శంగా తీసుకుని అప్పట్లో 50 మంది వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు మాల ధరించారు. రెండో ఏడాది 300 మంది, మూడో ఏడాది 2వేల మంది వరకు వేస్తే.. నాలుగో సంవత్సరం శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఐదువేల మంది శివమాల ధరించడం విశేషం. నాలుగేళ్ల క్రితం వరకు శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల ప్రజలు శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శివమాల ధరించినా వారంతా శ్రీశైలం వెళ్లి మొక్కు తీర్చుకునేవారు. నాలుగేళ్ల నుంచి శివమాల ధరించిన వారంతా శ్రీకాళహస్తిలోనే మొక్కులు చెల్లించుకుని స్వామి, అమ్మవార్లను దర్శించుకోవడం ఆనవాయితీ.

నేటి నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు


డిపో మేనేజర్ ప్రశాంతి

పుత్తూరు రూరల్: ఈనెల 18న మహాశివరాత్రిని పురస్కరించుకుని పుత్తూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ప్రశాంతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు మూడు రోజుల పాటు 59 ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు తెలిపారు. పుత్తూరు బస్టాండ్ నుంచి సదాశివకోన, కైలాసకోన, మూలకోన (పెద్దతీర్థంకోన)కు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఆదివారం సాయంత్రం వరకు సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు. పుత్తూరు నుంచి సదాశివకోనకు రూ.40, కైలాసకోన, మూలకోనకు రూ.30 చొప్పన చార్జీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల నిబంధనలివీ..

చిత్తూరు కలెక్టరేట్ : తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్ల, ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం నోటిఫికేషన్ విడుదల అయింది. నోటిఫికేషన్ వెలువడిన వెంటనే చిత్తూరు కలెక్టరేట్‌లో ఉమ్మడి ప్రకాశం–నెల్లూరు–చిత్తూరు జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్వో జేసీ వెంకటేశ్వర్ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను మొదలుపెట్టారు. నామినేషన్ల స్వీకరణ ఈ నెల 23వ తేదీవరకు, పరిశీలన ఈ నెల 24 వరకు, ఉపసంహరణకు ఈ నెల 27 వరకు అవకాశం ఉంటుందని, ఎన్నికల పోలింగ్ మార్చి 13న ఉంటుందని అధికారులు తెలిపారు.

నిబంధనలు..

- దాఖలు చేసే అభ్యర్థులు రాష్ట్రంలో ఏదైనా ఒక శాసనసభ నియోజకవర్గ పరిధిలో ఓటరుగా నమోదై ఉండాలి. పట్టభద్రుల శాసన మండలి స్థానంలో ఓటరుగా నమోదు కాకున్నా పోటీ చేయవచ్చు.
- ఫారం ×2ఇ౯ని ఖాళీలు లేకుండా నింపాలి. సాధారణ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.5 వేల డిపాజిట్‌ను నగదు లేదా చలానా రూపంలో చెల్లించాలి.
- స్వతంత్ర అభ్యర్థులను పదిమంది పట్టభద్ర ఓటర్లు బలపర్చాలి. గుర్తింపు పొందిన రాజకీయపార్టీల తరపున పోటీ చేసే అభ్యర్థులు పార్టీలు జారీ చేసే ఏఏ, బీబీ ఫారాలను అందజేయాలి. తమ పేరు బ్యాలెట్ పేపరులో ఎలా ఉండాలో స్పష్టంగా తెలపాలి.
- నామపత్రం దాఖలు సమయంలో అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే కలెక్టరేట్ లోపలికి అనుమతిస్తారు.

ఆస్పత్రిలో ఉన్న అల్లుని చూసేందుకు వెళ్లి..


చికిత్స పొందుతున్న శ్రీరాములు


గుండెపోటుతో మృతి చెందిన లక్ష్మమ్మ

సోమల: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అల్లున్ని చూసేందుకు వెళ్లి అత్త మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. మండలంలోని భారతంమిట్ట గ్రామానికి చెందిన బత్తల శ్రీరాములు(65) బుధవారం రాత్రి సోమలలో పనులు చూసుకుని కాలినడకన భారతంమిట్ట గ్రామానికి వెళ్తున్నాడు. అయితే తహసీల్దార్ కార్యాలయం వద్ద వెనుక నుంచి ఎస్.నడింపల్లెకు చెందిన బీరప్ప ద్విచక్రవాహనంతో శ్రీరాములును ఢీకొట్టాడు. ఈ ఘటనలో శ్రీరాములు తీవ్రంగా గాయపడడంతో స్థానికులు 108 వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించారు. అతని పరిస్థితి విషయంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బంధువులు తిరుపతికి తరలించారు. ఈ విషయం తెలిసి శ్రీరాములు అత్త లక్ష్మమ్మ(82) గురువారం అల్లున్ని చూసేందుకు ఆస్పత్రికి వెళ్లింది. అక్కడ శ్రీరాములును చూసి హఠాత్తుగా కుప్పకూలి కింద పడిపోవడంతో వెంటనే వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని సదుం మండలం నడిగడ్డ గ్రామానికి బంధువులు తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారా విక్రేత అరెస్ట్


మహిళ అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ రవికుమార్

చౌడేపల్లి: సారా విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రవికుమార్ గురువారం తెలిపారు. దుర్గసముద్రం పంచాయతీ బండమీదపల్లెకు చెందిన ఎన్.రాజమ్మ సారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. ఆమె ఇంటిలో ఉన్న 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం ఆమెను అరెస్ట్ చేసి పుంగనూరు కోర్టులో హాజరు పరచగా, న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు ఎస్ఐ తెలిపారు.

బంగారుపాళెం తహసీల్దార్ బెన్నురాజ్ సరెండర్



చిత్తూరు కలెక్టరేట్ : బంగారుపాళెం మండలం తహసీల్దార్ బెన్నురాజ్‌ను సరెండర్ చేశారు. ఆయన విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, ఈ నెల 15న చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముకేష్ కుమార్ మీనాకు లేఖ రాశారు. ఆ లేఖకు స్పందించిన ఎన్నికల సంఘం స్పందించి సరెండర్‌కు అంగీకరిస్తున్నట్లు గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన స్థానంలో మరొకరికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పజెప్పి ఎన్నికల కసరత్తు నిర్వహించాలని చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బోయకొండ గంగమ్మ ఆలయానికి భారీ ఆదాయం

- వేలంపాట ద్వారా రూ.1.14 కోట్లు రాబడి
- గత ఏడాది కంటే రూ.53.39 లక్షలు రెట్టింపు ఆదాయం
- మరో నాలుగు వేలంపాటలు వాయిదా


బోయకొండలో వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ శంకర్ నారాయణ, ఈఓ చంద్రమౌళి

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద వివిధ హక్కుల నిర్వహణ లీజు కోసం ఏడాది గడువు ఇస్తూ నిర్వహించిన వేలంపాట ద్వారా రూ.1.14 కోట్లు ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ తెలిపారు. గురువారం ఆలయ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో 9 హక్కుల నిర్వహణకు లీజుకోసం వేలంపాట నిర్వహించారు. వేలంలో పాల్గొనడానికి వివిధ ప్రాంతాల నుంచి 75 మంది హాజరయ్యారు. ఒక్కొక్కరు రూ.2 లక్షలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన్నారు. బోయకొండ ఆలయం వద్ద క్యాంటీన్, ఐస్‌క్రీమ్, కూల్ డ్రింక్స్ విక్రయించుకోవడానికి హక్కును రూ.15 లక్షలకు కొలింపల్లెకు చెందిన గంగిరెడ్డి సొంతం చేసుకొన్నారు. కొండపైన పవిత్ర దారాలు, కలకండ, వగైరా విక్రయించుకోవడానికి షాప్ నంబరు 1ను రూ.15 లక్షలకు కొలింపల్లె గంగిరెడ్డి, షాప్ నంబరు–2ను రూ.10.54 లక్షలకు బండ్లపై సురేంద్ర, షాప్ నంబరు–3ను రూ.17 లక్షలకు బండ్లపై రెడ్డెప్ప, షాప్ నంబరు–4ను రూ.14.18 లక్షలకు బండ్లపై నరసింహులు దక్కించుకున్నారు. అలాగే కొండపై క్లాక్ రూములు నిర్వహణ(సెల్‌ఫోన్, లగేజీ మాత్రమే)కు రూ.27.02 లక్షలకు మదనపల్లెకు చెందిన రామచంద్ర సొంతం చేసుకున్నారు. పేపరు కవర్లు, బ్యాగులు విక్రయించుకునేందుకు రూ.8.06 లక్షలకు బండ్లపై నాగార్జున దక్కించుకున్నారు. పాదరక్షలు భద్రపరచడానికి రూ.8.11 లక్షలకు గొల్లపల్లెకు చెందిన మహేష్ కైవసం చేసుకున్నాడు. గతేడాది కంటే ఈసారి రూ.53.39 లక్షలు అదనంగా అమ్మవారి ఆలయానికి ఆదాయం సమకూరినట్లు చైర్మన్, ఈఓ చంద్రమౌళి తెలిపారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు శ్రావణి, ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఎక్స్‌అఫీషియో మెంబరు గంగిరెడ్డి తదితరులు ఉన్నారు.

వాయిదా పడిన వేలంపాట..

గురువారం నిర్వహించిన వేలంలో సరైన మద్దతు ధర రాకపోవడంతో వేలంపాటలను వాయిదా వేసినట్లు ఈఓ చంద్రమౌళి ప్రకటించారు. కొండ కింద క్యాంటీన్, ఐస్ క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్ విక్రయించుకునేందుకు హక్కు, ఐ?ఫొటోలు తీసుకోవడానికి అనుమతి, కొండ కింద తాత్కాలిక అంగళ్ల నిర్వహణ హక్కు, భక్తులు సమర్పించిన పుష్ప, ఫల వృథా పదార్థాలను సేకరించుకునేందుకు హక్కుల కోసం నిర్వహించిన వేలంపాటలు వాయిదా వేశారు. తిరిగి వేలం నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని ఈఓ తెలిపారు.

విజయసాధన పుస్తక ఆవిష్కరణ


విజయసాధన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విజయసాధన పుస్తకాన్ని ముద్రించడం జరిగిందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆయన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి విద్యాశాఖ, ఉమ్మడి పరీక్షల విభాగం ఆధ్వర్యంలో విజయసాధన పుస్తకం రూపొందించినట్లు చెప్పారు. జిల్లాలో నిష్ణాతులైన ఉపాధ్యాయులచే తయారు చేసిన ఈ పుస్తకం వెనుకబడిన విద్యార్థులు కనీసం 50 మార్కులు సాధించేలా రూపొందించినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంల వద్ద, జిల్లా కేంద్రంలోని పీసీఆర్ పాఠశాలలో ఉన్న ఉమ్మడి పరీక్షల విభాగం కేంద్రంలో పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం సెక్రటరీ హేమారెడ్డి, హెచ్‌ఎంలు రమేష్, త్యాగరాజరెడ్డి, యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జీవీ రమణ, పీడీ శెల్వపాండియన్ పాల్గొన్నారు.

విధులకు సక్రమంగా రాకపోతే చర్యలు

వెదురుకుప్పం: ఉపాధ్యాయులు విధులను సక్రమంగా, లేదంటే చర్యలు తప్పవని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. గురువారం ఆయన వెదురుకుప్పం ఎమ్మార్సీని తనిఖీ చేశారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలకు ఇంకా 44 రోజులు సమయం ఉందని ప్రతి ఒక్కరూ ప్రణాళికాబద్ధంగా చదివి మెరుగైన ఫలితాలు సాధించాలన్నారు. టెన్త్ విద్యార్థులకు సాయంత్రం పూట ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. అనంతరం పచ్చికాపల్లం, తిరుమలయ్యపల్లె జెడ్పీ హైస్కూళ్లను సందర్శించారు. సీఆర్పీ పరిధిలోని స్కూళ్లను ఆయా క్లస్టర్ హెచ్‌ఎంలు పర్యవేక్షించాలన్నారు. అనుమతి లేకుండా విద్యావలంటీర్లను నియమించుకున్న అగ్గిచేనుపల్లె, వేణుగోపాలపురం (ఎం), వేణుగోపాలపురం(టి) ప్రాథమిక స్కూళ్ల ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా విధులకు సక్రమంగా హాజరుకాని సద్దికూళ్లపల్లె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన నల్లవెంగనపల్లె ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మండలానికి రెగ్యులర్ ఎంఈఓను నియమిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో సీఆర్పీలు మనోహర్‌వర్మ, షణ్ముగం, హెచ్‌ఎం వెంకటరమణారెడ్డి, వరప్రసాద్ పాల్గొన్నారు.